మరింత రుచిగా గోరుముద్ద

- నేటి నుంచి జగనన్న గోరుముద్దలో చేరనున్న రాగిజావ
- వారానికి మూడు రోజుల పాటు అమలు
- నాణ్యమైన పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు

బొమ్మనహాళ్: జగనన్న గోరుముద్ద (మధ్యాహ్న భోజన పథకం)లో మరో పోషకాహారం చేరనుంది. సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మరింతగా పోషక మిళితంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. పిల్లలకు తగినంత ఐరన్, కాల్షియం అందించేందుకు వీలుగా మార్చి 2వ తేదీ నుంచి మధ్యాహ్న భోజనం మెనూలో అదనంగా రాగి జావను చేర్చనుంది. ప్రస్తుతం జగనన్న గోరుముద్ద మెనూలో ప్రతి రోజూ గుడ్డు, చిక్కీతో సహా రోజుకో వెరైటీ కూరతో పోషకాహారాన్ని అందిస్తున్నారు. విద్యార్థుల్లో రక్తహీనత కనిపిస్తున్న నేపథ్యంలో ఈ మెనూకి అదనంగా రాగిజావను చేర్చారు. వారానికి మూడు రోజుల పాటు మంగళ, గురు, శనివారాల్లో రాగిజావ ఇవ్వనున్నారు. దీనికోసం పాఠశాలకు రాగి పిండి, బెల్లం ప్రభుత్వమే సరఫరా చేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులకు మేలు జరగనుంది.



శ్రీధరఘట్ట ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి (ఫైల్)

జగనన్న గోరుముద్ద మెనూ

- సోమవారం: వెజ్ పలావ్, గుడ్డు కూర, చిక్కీ
- మంగళవారం: పులిహోర, దొండకాయచట్నీ, గుడ్డు
- బుధవారం: వెజ్ బిర్యానీ, బంగాళదుంప కూర, గుడ్డు, చిక్కీ
- గురువారం: లెమన్ రైస్, టమాట చట్నీ, గుడ్డు
- శుక్రవారం: పప్పు ఆకుకూర, అన్నం, గుడ్డు, చిక్కీ
- శనివారం: ఆకుకూరతో చేసిన అన్నం, స్వీట్ పొంగల్

ప్రభుత్వ పాఠశాలల వివరాలు

నియోజకవర్గం	పాఠశాలలు	భోజనం చేసే విద్యార్థులు
కళ్యాణదుర్గం	300	32,666
రాయదుర్గం	285	50,314
ఉరవకొండ	133	38,067

రాగిజావ అందిస్తాం



జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగిజావ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం సన్నాహాలు చేస్తున్నాం. ప్రతి పాఠశాలకు రాగిపిండి, బెల్లం ప్రభుత్వమే సరఫరా చేయనుండటంతో విద్యార్థులకు రాగాజావ అందిస్తాం. వేరుశనగ, నువ్వులు, ఆకుకూరలు, గుడ్డుతో పాటుగా రాగి పిండిలో ఐరన్ కంటెంట్ ఉంటుంది. ఇవి విద్యార్థుల్లో రక్తహీనతను నివారిస్తాయి.

– తిమ్మప్ప, ఎంఈఓ, బొమ్మనహాళ్

పోషకాలు అధికం



రాగి పిండిలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. కాల్షియం ఎముకల ధృఢత్వానికి ఉపయోగపడుతుంది. పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. రక్తహీనత నివారిస్తుంది. వేసవిలో రాగిజావ వేడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. విద్యార్థులు రాగిజావను సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రావణ్‌కుమార్, వైద్యాధికారి, డి.హీరేహాళ్ పీహెచ్‌సీ

క్లుప్తంగా

బాల్య వివాహాలతో అనర్థాలు



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

బొమ్మనహాళ్: మాతాశిశు మరణాలు అరికట్టాలంటే, బాల్య వివాహాలు నిర్మూలించాలని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి తెలిపారు. బుధవారం మండలంలోని గోనేహాళ్‌లో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ.. చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల ప్రసవం సమయంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని చెప్పారు. బాల్య వివాహాలను అరికట్టాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, ఉపాధ్యాయులు హనుమంతప్ప, కాశీదాసు, లక్ష్మి, నరసమ్మ, పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చిత్రప్రదర్శన ప్రారంభం

ఉరవకొండ: గవిమఠం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఉరవకొండ ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం అభిషేక లింగం, ఆధ్యాత్మిక చిత్రప్రదర్శన ప్రారంభమైంది. ఆదోని చౌకి మఠం పీఠాధిపతులు కళ్యాణస్వామి, మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సాహితీ మాట్లాడారు. ఆధ్యాత్మిక చిత్రప్రదర్శన అద్భుతంగా ఉందన్నారు. ఇందులో దేశ వ్యాప్తంగా ఉన్న జ్యోతిర్లింగాలతో పాటు దూదితో చేసిన శివలింగం ఆకట్టుకుంటుందని తెలిపారు. మూడు రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మాట్లాడుతున్న గుత్తి డీవైఈఓ శంకర్‌ప్రసాద్

కణేకల్లు: పదో తరగతిలో వెనుకబడిన 'సీ' 'డీ' గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని గుత్తి డీవైఈఓ శంకర్‌ప్రసాద్ ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని మాల్యం జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం హెచ్‌ఎం ఫయాజుద్దీన్‌తో కలిసి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పది పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. ఏయే సబ్జెక్ట్‌ల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారో గుర్తించి, ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలన్నారు. 'అనంత సంకల్పం' వంద రోజుల కార్యక్రమంపై ఆరా తీశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. కష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలన్నారు. ఒత్తిడికి గురికాకుండా ఏకాగ్రతతో పరీక్షలు రాయాలన్నారు.

పాఠశాల తనిఖీ..

విడపనకల్లు: మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గుత్తి డీవైఈఓ శంకర్‌ప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులకు సూచనలిచ్చారు. ప్రతి ఒక్కరూ ఇష్టపడి చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. అనంతరం నాడు–నేడు పనుల పురోగతిపై సమీక్షించారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సర్వమంగళం, పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి గాయాలు

కూడేరు: మండల పరిధిలోని ముద్దలాపురంలో బుధవారం అంజనమ్మ అనే వృద్ధురాలు.. అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి గుండా కాలినడకన ఇంటికి వెళుతుండగా ఉదిరిపికొండకు చెందిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ఘటనలో గాయపడిన ఆమెను స్థానికులు 108లో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

15 లోపు రుణాలు రెన్యూవల్ చేసుకోండి

కుందుర్పి: బండమీదపల్లి సహకార సంఘం పరిధిలో పంట రుణాలు తీసుకొన్న రైతులు ఈనెల 15లోపు రెన్యూవల్ చేసుకోవాలని సహకార సంఘం సీఈఓ జాలప్ప, అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి ఓ ప్రకటనలో సూచించారు. అలాగే ఈనెల 10లోపు ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. సహకార సంఘంలో ఓటుహక్కు కోసం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో సీఈఓను సంప్రదించాలన్నారు.

ఓటర్లకు స్లిప్పులు అందించండి

ఉరవకొండ: రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులను అధికారులు అప్రమత్తంగా నిర్వహించాలని తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్లకు స్లిప్పుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 2,186, ఉపాధ్యాయ ఓటర్లు 197 మంది ఉన్నారన్నారు. వీరు ఏదైనా గుర్తింపు చూపించి తమ ఓటరు స్లిప్పును తీసుకెళ్లాలన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం



కళ్యాణదుర్గం: మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



వార్డు సచివాలయం వద్ద ఓట్లు అభ్యర్థిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు

కళ్యాణదుర్గం: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పిస్తున్నారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం జగన్ బీసీలకు 11 ఎమ్మెల్సీ స్థానాలిచ్చారన్నారు. వెన్నపూస రవీంద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుకు శక్తివంచన లేకుండా పనిచేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. సీఎం జగనన్న ఆశీస్సులతో బరిలో ఉన్నానన్నారు. ఎమ్మెల్సీగా తనకు అవకాశం కల్పిస్తే నిరంతరం ప్రజా సమస్యలపై పాటుపడుతానని తెలిపారు. పట్టభద్రులు తనపై నమ్మకం ఉంచి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నియోజకవర్గ పరిశీలకుడు ఎంఆర్‌సీ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మంగమ్మకు సన్మానం

కళ్యాణదుర్గం: ఇటీవల నూతనంగా ఎన్నికైన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మంగమ్మను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన అనంతరం మొట్టమొదటి సారిగా కళ్యాణదుర్గంకు వచ్చిన ఎమ్మెల్సీ బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, జెడ్పీటీసీలు బొమ్మన్న, నాగరాజు, బీసీ సేవా సమితి తాలూకా అధ్యక్షుడు ములకనూరు గోవిందు, బ్రహ్మసముద్రం కన్వీనర్ బసవరాజు, నాయకులు రాంభీమప్ప, గోళ్ల మోహన్‌రెడ్డి, అప్జల్, సుబ్బరాయుడు, కేశవగౌడ్ పాల్గొన్నారు.

బెళుగుప్ప: కాలువపల్లిలో ఇటీవల ప్రతిష్ఠించిన కనదాస విగ్రహానికి రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ బుధవారం కురుబ సంఘం నాయకులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాస్, సర్పంచ్ ఎండీ పెద్దన్న, కురుబ సంఘం మండల అధక్షుడు కరుణాకర్, నాయకులు అనిల్, గాలిబ్రహ్మయ్య, తగ్గపర్తి రాజగోపాల్, గాలి బ్రహ్మయ్య, అక్కులన్న, మాజీ ఎంపీటీసీ వెంకటేశులు, ప్రభాకర్, ఎర్రిస్వామి, షణ్ముఖ, మహేష్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన 'శని' చంద్రబాబు

రాయదుర్గం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి పట్టిన పెద్ద శని అని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డు సచివాలయాలను వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, నాయకుడు పొరాళ్ల శివ, గుమ్మఘట్ట మండల కన్వీనర్ బోయ మంజునాథతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ వెంటిలేటర్‌పై ఉందన్నారు. 2024 ఎన్నికల్లో పచ్చపార్టీ తుడిచిపెట్టుకుపోతుందన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు టీడీపీకి లేదని ధ్వజమెత్తారు. ఉద్యోగులు, నిరుద్యోగులను మోసం చేసిన ఏకైక వ్యక్తి చంద్రబాబు మాత్రమేనని దుయ్యబట్టారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేసే సత్తా వైఎస్సార్‌సీపీ తరఫున అభ్యర్థులుగా నిలిచిన వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డికి ఉందన్నారు. వారి అఖండ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాబు ఉసరవెల్లి అయితే.. కాలవ మహా జిత్తుల మారి అని ఎద్దేవా చేశారు. వీరి మాటలు నమ్మి ఏ ఒక్కరు మోసపోవద్దని హితవుపలికారు. మంచిచేసే ప్రభుత్వానికి మేధావులు, ఉద్యోగులంతా అండగా నిలవాలన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేసి మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డికి వేయాలని కోరారు.

పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

రాయదుర్గం: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా పటిష్ట చర్యలు చేపట్టామని తహసీల్దార్ మారుతి పేర్కొన్నారు. పట్టణంలోని పలు పోలింగ్ స్టేషన్‌లను బుధవారం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సుజాత, సీనియర్ సహాయకుడు రామాంజినేయులుతో కలసి పరిశీలించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో పీఎస్ నెంబర్లు, కావాల్సిన సౌకర్యాలు, వెంటిలేషన్, తాగునీటి, విద్యుత్ లాంటి సమస్యలను గుర్తించి సరిచేసేలా చర్యలు చేపట్టామన్నారు.

మహిళల్లో చైతన్యం నింపడమే లక్ష్యం

శెట్టూరు: మహిళల్లో చైతన్యం నింపడమే లక్ష్యమని డాక్టర్ వేణుకార్తికేయ అన్నారు. బుధవారం ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మహిళా దినోత్సవానికి సంబంధించి వారోత్సవాల నిర్వహణపై చర్చించారు. మార్చి ఒకటి నుంచి ఎనిమిది వరకూ వివిధ కార్యక్రమాలను గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు, లింగ వివక్ష, లింగ నిర్ధారణ పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శోభాలత, సూపర్‌వైజర్లు లీలావతి, సుమతి, ఫార్మసిస్టు యామిని, స్టాఫ్‌నర్స్ అంజలి, కార్యకర్తలు విశాలాక్షి, విమల, అపర్ణ, భీమక్క పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

బొమ్మనహాళ్: బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు , మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ల్లారెడ్డి (69) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. నేడు జరిగే అంత్యక్రియల్లో పాల్గొనున్నారు.

'గాలికుంటు' ప్రమాదకరం

బొమ్మనహాళ్: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమని పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా గురువారం నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డీసీసెస్–ఎఫ్‌ఎండీ) నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 17 వేల ఆవులు, ఎద్దులకు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. అంటువ్యాధి అయిన ఇది సోకితే పశువుల్లో మరణాలు తక్కువైనా బలహీనపడడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం జరుగుతుందన్నారు. 104 నుంచి 106 డిగ్రీల జ్వరం, నోరు, నాలుక వద్ద పుండ్లు ఏర్పడి మేత మేయకపోవడం, చొంగకార్చడం, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు.

జలజీవన్ మిషన్ పనుల ప్రారంభం

విడపనకల్లు: మండల పరిధిలోని గడేకల్లు గ్రామంలో బుధవారం ఎంపీపీ కరణం పుష్పావతి, సర్పంచు సుశీల ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభమయ్యాయి. ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేసి తాగునీటి సమస్య లేకుండా చూడలన్నదే జలజీవన్ మిషన్ లక్ష్యమని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఓబుళేసు, మాజీ సర్పంచు కరణం భీంరెడ్డి, నాయకులు హంపయ్య, ఉమాశంకర్, జయరాములు, ప్రసాదు, ఎర్రెన్న, చిన్న తిమ్మప్ప, సునీల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



నమూనాలను తిలకిస్తున్న విద్యార్థులు

బ్రహ్మసముద్రం: విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించామని ఉపాధ్యాయులు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పాలవెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైన్స్ టీచర్ కె.సురేంద్రబాబు ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. పర్యావరణం, శాస్త్ర సాంకేతిక, వ్యవసాయ రంగం, మానవ శరీర ఆరోగ్య , వైజ్ఞానిక ఆవిష్కరణకు సంబంధించిన నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. మామడూరు, ఎరడికెర, వెస్ట్‌కోడిపల్లి, ఎర్రకొండాపురం పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరై ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో చెర్లోపల్లి హెచ్‌ఎం లక్ష్మీశిరిష, ఉపాధ్యాయులు గాయత్రి, హెచ్‌ఎం చంద్రమౌళి, ఉపాధ్యాయులు మంజునాథ, ప్రశాంతి పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉరవకొండ వడ్డెర్ల సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం గవిమఠం ఆవరణలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వడ్డెర్ల సంఘం నాయకులు వడ్డె గంగరాజు, చిన్నబాబు, శివశంకర్, గోవిందరాజు మాట్లాడుతూ.. చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఐ శేఖర్ మాట్లాడుతూ రథోత్సవం సందర్భంగా ఎంతోమందికి ఉపయోగపడే రక్తదాన శిబిరాన్ని చేపట్టడం వడ్డెర్ల సంఘం గొప్పతనమన్నారు. శిబిరంలో వడ్డెర్ల సంఘం నాయకులతో పాటు మొత్తం 300 మంది రక్తదానం చేశారు.

శుభకార్యం

కూడేరు: మండల పరిధిలోని ముద్దలాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత గొల్ల ఎర్రిస్వామి కుమార్తె మంజుల వివాహం బుధవారం అనంతపురంలోని రజాక్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి, ఎంపీపీ నారాయణ రెడ్డి హాజరై, వధూవరులను ఆశీర్వదించారు.

ఓటు హక్కుపై అవగాహన రేపు

కుందుర్పి: ఈనెల 3వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కు వినియోగంపై గ్యాడ్యుయేట్ ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ నారాయణ స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 12 గ్రామ పంచాయితీలకు చెందిన గ్రాడ్యుయేట్ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

నేడు బహిరంగ వేలం

కూడేరు: మండల కేంద్రంలోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి పుణ్యక్షేత్రం వద్ద పూజా సామగ్రి విక్రయ దుకాణం ఏర్పాటుకు గురువారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దుకాణం కాలపరిమితి ఏడాది పాటు మాత్రమే ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

బొమ్మనహాళ్: వేసవి నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ యు.పద్మ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా చేపట్టిన పురోగతి, అభివృద్ధిపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా రూ.42 కోట్ల నిధులు మంజూరుకు ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి ప్రత్యేక కృషి చేశారనన్నారు. ప్రభుత్వం మండలంలోని ఉద్దేహాళ్ సహాకార సొసైటీ సంఘంలో జొన్నలు, పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. క్వింటా జొన్నలు రూ.2,970, క్వింటా పప్పుశనగ రూ.5,335 ప్రభుత్వం ధర నిర్ణయిందని ఏఓ తెలిపారు. 8 వేల ఎకరాల్లో ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ 100 శాతం పూర్తయినట్లు వెల్లడించారు. 9,530 మంది రైతులకు రైతు భరోసా, పీఎం కిసాన్ డబ్బులు అందాయన్నారు. గోవిందవాడ, కల్లుదేవనహళ్లి గ్రామాలకు శ్రీరామిరెడ్డి తాగునీటి ఇంటింటికి అందిస్తుంటే పచ్చ పత్రికలు తప్పుడు రాతలు రాయడం సమజసం కాదన్నారు. ఇంటింటికి తాగునీరు వస్తుంటే మురుగు నీరు వస్తున్నాయని తప్పుడు వార్తాలు ప్రచురించడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ షకీలాబేగం, వైద్యాధికారిణి మల్లీశ్వరి, వైస్ ఎంపీపీలు రమేష్, నాగరత్నమ్మ, కో–ఆప్షన్ మెంబర్ మాబుసాబ్, పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

17 నుంచి తాగునీటి కార్మికుల సమ్మె

కూడేరు: ఈనెల 17 నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు ఉమ్మడి జిల్లాలోని సత్యసాయి తాగునీటి కార్మికుల సంఘం నేతలు తిప్పేస్వామి, శ్రీరాములు, మహబూబ్ బాషా, రమేష్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ మేరకు సమ్మె నోటీసులు కలెక్టరేట్, సత్యసాయి డీఈకి ఇచ్చినట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న 5 నెలలు జీతాలు, ఇతర బెనిఫిట్స్ కోసమే సమ్మె చేస్తున్నట్లు వెల్లడించారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపిక



బాలాకుమార్

కళ్యాణదుర్గం: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఈనెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బాలాకుమార్ ఎంపికైనట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీఎల్ కాంతారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మసముద్రం మండలం నంజాపురానికి చెందిన బాలాకుమార్ బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు.

శిక్షణకు హాజరైన సచివాలయ కన్వీనర్లు

కళ్యాణదుర్గం: కడపలోని శిల్పారామం కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగిన ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లకు శిక్షణ తరగతులకు కళ్యాణదుర్గం కన్వీనర్లు తరలివెళ్లారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం అర్బన్ కన్వీనర్ అర్చన, రూరల్ కన్వీనర్ ఆంజనేయులు, కంబదూరు గంగాధర్, కుందుర్పి రాము, శెట్టూరు పెరుగు తిమ్మరాజు, బ్రహ్మసముద్రం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సెబ్ సీఐగా జయనాథ్‌రెడ్డి

రాయదుర్గం: రాయదుర్గంలో మద్యం, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సీఐ కే జయనాథ్‌రెడ్డి హెచ్చరించారు. సత్యసాయి జిల్లా తనకల్లు సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న జయనాథ్‌రెడ్డిని రాయదుర్గానికి బదిలీ చేశారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించి, రికార్డులను పరిశీలించారు.

నీటి సమస్య పరిష్కరించాలని వినతి

కూడేరు: స్థానిక బాలికల వసతి గృహం వెనుక భాగంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషాకు బుధవారం కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. మధుసూదన్, సంగప్ప, తిప్పయ్య మాట్లాడుతూ.. 15 రోజులుగా తాగునీరు సరఫరా కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిష్కారం చూపుతామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

ఘనంగా చంద్రమౌళీశ్వరుడి రథోత్సవం



పీఠాధిపతి ఆశీస్సులు పొందుతున్న యువనేత ప్రణయ్, ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ మంజుల

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాల అనంతరం గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్ర స్వామి, చౌకి మఠం పీఠాధిపతి కళ్యాణస్వామి, దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామాంజినేయులు, మఠసహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఏజెంట్ రాజన్నగౌడ్ తదితరులు భారీ ఊరేగింపు నడుమ చంద్రమౌళీశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా రథం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం శంభోశంకర అంటూ భక్తులు రథాన్ని లాగారు. సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, ఈఓ గౌస్‌సాహెబ్, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పాలకవర్గ సభ్యులు ప్రత్యేకంగా తయారు చేయించిన గజమాలలను గవిమఠ అధికారులకు అందించారు. రథోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ మంజుల, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తనయుడు యువనేత ప్రణయ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూధన్‌రెడ్డి, ఎమ్మెల్యే కేశవ్, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, పార్టీ పట్టణ కన్వీనర్ బ్యాంకు ఓబుళేసు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వజ్రకరూరు: స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో తప్పక హాజరు కావాలన్నారు.

ముత్యాల పల్లకీలో ఊరేగిన మద్దానేశ్వరుడు



ముత్యాల పల్లకీ ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాపు

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపంలో వెలసిన మద్దానేశ్వర స్వామి రథోత్సవం, పశువుల జాతరను పురస్కరించుకుని ముత్యాల పల్లకీ ఉత్సవం, లంకాదహనం బుధవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. తొలుత రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, గుమ్మగట్ట జెడ్పీటీసీ మహేష్ , మండల కన్వీనర్ బోయ మంజునాథతో కలిసి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నుంచి బసవన్న కట్ట వరకూ కొనసాగిన ముత్యాల రథోత్సవం ముందు జనం నందికోళ్లతో నృత్యాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దురుగమ్మ, అన్నదాన కమిటీ అధ్యక్షుడు జయన్న, మహానందీశ్వర, ధరణేష్, అప్పాజీ, గోవిందప్ప, ఉలుగప్ప, ఎంపీటీసీ లక్ష్మి , ఆయతపల్లి జనార్ధన, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.